క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సహాయం

కాకుమాను: మండలంలోని కొండపాటులో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న గడ్డిపాటి రాజమణి(45) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాకుమాను ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎస్.రాజశేఖర్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమె భర్తకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నగదును త్వరితగతిన వచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు తెలిపారు.

విజ్ఞాన్ రిజిస్ట్రార్‌గా పీఎంవీ రావు బాధ్యతల స్వీకరణ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా పీఎంవీ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన పీఎంవీ రావు విజ్ఞాన్ యూనివర్సిటీలో గడిచిన 26 ఏళ్లుగా పనిచేస్తూ విశేషమైన సేవలను అందించారు. విద్యారంగంలో సుదీర్ఘ అనుభవం కలిగి, ఆధునీకరణ, పరిపాలనలో పారదర్శకత, విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యాలతో పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పీఎంవీ రావు మాట్లాడుతూ.. రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించడం ద్వారా తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. యూనివర్సిటీను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అభివృద్ధి చేస్తానన్నారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని చౌడవరం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. చౌడవరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళుతుండగా మార్గ మధ్యలో బైక్‌ను రోడ్డు పక్కన పార్క్ చేశాడు. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళుతున్న కారు మితిమీరిన వేగంతో వచ్చి బైక్‌ని ఢీకొంది. దీంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ద్విచక్రవాహనం పూర్తిగా ధ్వంసమైంది. వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటంతో వివరాలు తెలియరాలేదని స్థానికులు తెలిపారు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని నల్లపాడు పోలీసులు అన్నారు.

రెండు బస్సులు ఢీ కేసు నమోదు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ రెండు బస్సులు ఢీకొన్న సంఘటన మండలంలోని వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. తెనాలి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకోవడానికి రోడ్డు పక్కన నిలిపారు. అదే సమయంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ముందు ఉన్న ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు రూరల్: అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ కుమారుడిని ఎత్తుకెళ్లారన్న తల్లి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తురకపాలెం గ్రామంలో ఓ మహిళకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్దకుమారుడిని నగరంలోని ఓ హాస్టల్‌లో చేర్పించి ఏడాది వయసున్న కుమారుడితో స్థానిక సత్రంలో జీవిస్తుంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు తమ వద్ద ఉన్న కుమారుడిని ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

గుంటూరు లీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థలో గురువారం మేడే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జి సెక్రటరీ, మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి వై.గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. చట్టాలపై ఆయన కార్మికులకు అవగాహన కల్పించారు. అనంతరం కార్మికులకు ఈ–శ్రమ కార్డులు పంపిణీ చేశారు. లేబర్ అసిస్టెంట్ కమిషనర్ పి.వి. ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు..

ఎగ్జిబిషన్ వివాదంలో దాడి

లక్ష్మీపురం: ఎగ్జిబిషన్‌లోని రైలు బోగి ఆపరేటర్‌గా పనిచేసే యువకుడిపై యజమాని దాడి చేసిన ఘటన గురువారం రాత్రి జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం.. గుంటూరు చేబ్రోలు హనుమయ్య కంపెనీ గ్రౌండ్స్‌లో సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్‌ను జానకీరామ్ ఏర్పాటు చేశాడు. భాగ్యనగర్ ప్రాంతానికి చెందిన రియాజ్ రైలు బోగీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సందర్శకులు సరైన వసతులు లేవని చెప్పడంతో, ఆ విషయం గమనించి జానకీరామ్ ఆపరేటర్‌పై దాడి చేశాడు. దీంతో రియాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రజాధనం.. నిరుపయోగం!

- అభివృద్ధికి దూరంగా నిడుబ్రోలు రైతు బజార్
- నిర్వహణకు ఖర్చు నెలకు రూ.44 వేలు, ఆదాయం రూ.27 వేలు



అభివృద్ధికి నోచుకోని నిడుబ్రోలు రైతు బజార్

పొన్నూరు: పట్టణంలో ప్రజా ప్రయోజనార్థం రైతుల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసిన రైతు బజారు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రధానంగా స్థానిక రైతులు పండించే కూరగాయలను విక్రయించుకునేందుకు ఏర్పాటు చేసిన రైతు బజార్ అధికారుల నిర్లక్ష్యంతో కుంటుపడింది. దీంతో ఖాళీ అయిన దుకాణాలను భర్తీ చేయడంలోనూ అధికారులు విఫలమవుతున్నారు. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన దుకాణాలు నిరుపయోగంగా మారాయి. ప్రజాధనం వృథా అయ్యే పరిస్థితులు సైతం నెలకొన్నాయి. విపరీతంగా పెరిగిన అద్దెల కారణంగా దుకాణాల నిర్వహణ భారంగా మారిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారుల ప్రోత్సాహం..

పట్టణంలోని అన్ని రహదారులకు అనుసంధానంగా ఉండే ప్రదేశంలో 2015 సంవత్సరంలో రూ.లక్షల వ్యయంతో రైతు బజార్‌ను నిర్మించారు. 22 దుకాణాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన కూరగాయలను వారే స్వయంగా విక్రయించుకునే విధంగా కొన్ని దుకాణాలను ఉచితంగా కేటాయించారు. వారితో పాటు డ్వాక్రా మహిళలు, వ్యాపార వర్గాలకు అద్దె ప్రాతిపదికన కేటాయించారు. గతంలో పనిచేసిన కొందరు అధికారులు రైతులను విస్మరించి.. వ్యాపార వర్గాలను ప్రోత్సహించడంతోనే రైతులు దూరమైయ్యారనే విమర్శలున్నాయి. రైతులు, వ్యాపారులు చేసే కూరగాయల విక్రయాలతో కొన్నేళ్ల పాటు కొనుగోలుదారులతో కళకళలాడిన రైతు బజారు అధికారుల చర్యల కారణంగా కాలక్రమే ప్రజాదరణ కోల్పోయింది. పెరుగుతున్న అద్దెల ప్రభావంతో వ్యాపారులు సైతం రైతు బజార్ నుంచి దూరమయ్యారు. దీంతో ఏళ్ల తరబడి దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 22 దుకాణాలలో ప్రస్తుతం రెండు దుకాణాల్లో రైతులు, 5 దుకాణాల్లో వ్యాపారులు విక్రయాలు నిర్వహిస్తున్నారు.

విపరీతంగా పెంచిన అద్దెలు..

రైతు బజార్ నిర్వహణకు మార్కెటింగ్ శాఖకు సుమారు రూ.44 వేలు ఖర్చు అవుతుండగా.. అద్దెల రూపంలో రూ. 27 వేలు మాత్రమే ఆదాయం సమకూరుతోంది. దీంతో దుకాణాలతో వచ్చే అద్దెల కన్నా నిర్వహణకే మార్కెటింగ్ శాఖకు వ్యయం పెరుగుతోంది. ప్రస్తుతం రైతు బజార్‌లో ఒక్కో దుకాణానికి రూ.5,500లు నిర్ణయించినట్లు తెలిసింది. ఇలా విపరీతంగా అద్దెలు పెంచితే దుకాణాలు ఎలా నిర్వహిస్తామని పలువురు వ్యాపారులు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్థానిక రైతు బజార్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.



అద్దెలు ఎక్కువగా ఉండటంతో ఖాళీగా ఉన్న దుకాణాలు

దుకాణాల కేటాయింపునకు చర్యలు..



రైతు బజార్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలను త్వరితగతిన భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. మొత్తం 22 దుకాణాల్లో ప్రస్తుతం 2 దుకాణాల్లో రైతులు, 5 దుకాణాల్లో వ్యాపారులు కూరగాయల విక్రయాలు చేస్తున్నారు. ఒక్కో దుకాణానికి రూ.5,500 అద్దె రూపంలో వసూలు చేస్తున్నాం. అద్దె భారాన్ని తగ్గించి వ్యాపారులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లాం. రైతులకు ఎలాంటి అద్దె లేకుండానే కేటాయిస్తున్నాం. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలి.

జి.రమేష్,
ఎస్టేట్ అధికారి, రైతు బజార్, నిడుబ్రోలు

ఊరూవాడా కార్మిక దినోత్సవం

ప్రపంచ కార్మిక దినోత్సవ మే డే వేడుకలను నగర పరిధిలోని పలు చోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు. పలు పార్టీ, ప్రభుత్వ, యూనియన్ కార్యాలయాల్లో నిర్వహించిన ఈ వేడుకలకు స్థానిక నాయకులు, అధికారులు హాజరయ్యారు. మే డే విశిష్టతను వివరించారు. జెండా ఆవిష్కరణలు, బైక్ ర్యాలీలు నిర్వహించి మేడే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు పోరాడి సాధించిన హక్కులను గుర్తు చేసుకున్నారు.



జెండా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీ నారాయణ



మాట్లాడున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

చేబ్రోలు: మే డే స్ఫూర్తితో 8 గంటల పని విధానాన్ని కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేబ్రోలు కొత్త రెడ్డిపాలెంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. పలు కార్యక్రమాల్లో లక్ష్మీనారాయణ కార్మిక హక్కులపై మాట్లాడారు. సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ హనుమంతరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు చౌడయ్య, మస్తాన్ వలీ, అశోక్, జి.శ్రీనివాసరావు, రిక్షా యూనియన్ నాయకులు యాకోబు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు చింతల శ్రీను, సీపీఎం మండల కార్యదర్శి పి.ఆదిశేషు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు గోపి, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు: కార్మిక సంక్షేమ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పొన్నూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్.బాజీ సాహెబ్ అన్నారు. పొన్నూరు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఏకా పవన్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్యానల్ న్యాయవాది మగ్బుల్ బేగ్, పారా లీగల్ వాలంటీర్లు షేక్. ముజీర్, మహమూద్ బేగ్, షేక్.జిలానీ, రమేష్ బాబు, షేక్.ముజీత్, పాల్గొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఆటో, భవన నిర్మాణ కార్మికులు మే డే ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు అరేటి రామారావు, పౌర హక్కుల సంఘం నాయకులు డాక్టర్ టి.రాజారావు, సత్యనారాయణ, కార్యదర్శి రత్నబాబు, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గుమ్మడి రోశయ్య సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గుంటూరు ఏడుకొండలు, ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు ఖాశీం, పట్టణ కార్యదర్శి గోవిందరాజు, నాయకులు రాఘవయ్య, రాంబాబు, దేవా నాగేశ్వరరావు, నందకుమార్, ఏతాటి వెంకట్రావు, ప్రవీణ్ కుమార్, బేగ్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న బార్ అసోసియేషన్ సభ్యులు

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో..

గుంటూరు రూరల్: మేడే సందర్భంగా మండలంలోని ఏటుకూరు గ్రామంలోని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ట్రేడ్ యూనియన్ నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెదకాకాని: మే డే స్ఫూర్తితో కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపునిచ్చారు. పెదకాకాని సెంటర్‌లో సి.ఐ.టి.యు పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ కార్యక్రమానికి అధ్యక్షతన వహించారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక, ప్రజానీకం ఐక్యమై ప్రతిఘటించాలని నేతాజీ పిలుపునిచ్చారు. మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో సి.ఐ.టి.యు జెండా ఆవిష్కరనను నాయకులు నిర్వహించారు. రాజా రమేష్, బి.బాబురావు, బి.సాంబయ్య, యు.శివయ్య, ఎస్.నీలాంబరం, అన్నమ్మ, ఆటో కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెదకాకాని, వెనిగండ్ల, నంబూరు గ్రామాల్లో జరిగిన మే డే వేడుకల్లో సి.పి.ఐ, ఎ.ఐ.టి.యు.సి నాయకులు పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. గుంటూరు జిల్లా ఏఐటీయూసీ నాయకులు పుప్పాల సత్యనారాయణ, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, పాటిబండ్ల డేవిడ్రాజు, బుల్లా బాబురావు, రామిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, దానబోయిన సాంబశివరావు, దర్శి లింగారావు, బాసీద్ లు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



పెదనందిపాడులో మే డే నినాదాలు చేస్తున్న నాయకులు


ప్రత్తిపాడు: కార్మికుల హక్కుల పరిరక్షణకు సీపీఐ నిరంతర పోరాటం చేస్తుందని సీపీఐ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు అన్నారు. మే డే సందర్భంగా నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని స్థానిక హెచ్.పి పెట్రోల్ బంకు వద్ద, సివిల్ సప్లై కార్యాలయంలో జెండాను కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఎస్.వీరాంజనేయులు, ఏఐటీయూసీ కార్యదర్శి మేడా తాతారావు, మండల కార్యదర్శి ఎం.అంకమ్మరావు, కుంచాల అంకమ్మరావు, వెంకట్రావు, ఆటో యూనియన్ నాయకులు బాబు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండల పరిధిలోని పెద గొట్టిపాడులో మే డే సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు మేస్త్రీలు మన్నవ అనూష రాణి, ప్రత్తిపాటి జ్యోతి కిరణ్మయిలు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ ప్రత్తిపాటి నాగభూషణం, కూలీలు పాల్గొన్నారు.

కాకుమాను: కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గాలకు వ్యతిరేఖంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు అన్నారు. మే డే సందర్భంగా పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జంపని రామారావు, వెంకట సుబ్బారావు, వెంకటేశ్వర్లు, భువనేశ్వరి, ఆశీర్వాదం, రాము మేస్త్రీ, రాజేంద్ర పాల్గొన్నారు. కాకుమానులోని స్థానిక ఉర్దూ పాఠశాల వద్ద సీఐటీయూ జెండాను మండల కార్యదర్శి ఆవిష్కరించారు. నాయకులు షేక్ బాషీద్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: కార్మికుల పోరాటాల ఫలితమే మే డే అని సి.ఐ.టి.యు జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు అన్నారు. ప్రత్తిపాడు ఆటోస్టాండ్ వద్ద ఆయా స్టాండ్‌ల అధ్యక్షులు గాలి నాగరాజు, మాణిక్యరావు, యాకోబులు పతాకావిష్కరణలు చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు పోరాటాల ద్వారా చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.ఆదినారాయణ, సి.ఐ.టి.యు నాయకులు సి.హెచ్. రమేష్, కె.ప్రసాద్, రంగనాయకులు, మధు, రంగారావు, వెంకటేశ్వరావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

అగ్రి గోల్డ్ బాధితులందరినీ ఏకం చేయాలి

లక్ష్మీపురం: అగ్రిగోల్డ్ కస్టమర్స్ -ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమితి సమావేశం స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో గురువారం నిర్వహించారు. సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ బాధితులు నిర్లక్ష్యంగా ఉంటే కుదరదని, ఎక్కడకక్కడ సమావేశాలు పెట్టుకుని ఉద్యమం చేయాలని తెలిపారు. బాధితులు కూడా ఉద్యమంలో పాల్గొనేటట్టు సమీకరించాలని నేతలకు చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులు కూడా ఆస్తులు వివరాలు, వాటి విలువలను సేకరించాలని తెలిపారు. అవసరమైతే ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ముప్పాళ్ల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమావేశంలో అసోసియేషన్ నగర గౌరవ అధ్యక్షులు కోట మాల్యాద్రి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, గని, అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి బి.వి. చంద్రశేఖరరావు, నాయకులు సిద్దేశ్వర, మల్లికార్జున, శివరామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

నేటి నుంచి 'కిశోరి వికాసం'

- అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసవి శిక్షణకార్యక్రమాలు
- ప్రణాళిక సిద్ధం చేసిన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమ్మర్ సెలవుల్లో ఆయా గ్రామాల్లోని 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల కిశోర బాల, బాలికలకు వేర్వేరుగా 12 రోజుల పాటు రోజుకో అంశంపై శిక్షణ ఇవ్వనున్నారు. ట్రెనింగ్ ఫెసిలిటేటర్లుగా మహిళా పోలీస్‌లు, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యవహరించనున్నారు. సంబంధించిన షెడ్యూల్‌ను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు విడుదల చేశారు. మే 2వ తేదీన బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం ఉంటుందని అన్నారు. మే 6న రుతుక్రమం, పరిశుభ్రతతో పాటు లైంగిక విద్య ఉంటుందన్నారు. 9న పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు తెలియజేస్తారు. 13న బాలల హక్కులు రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన.. 16న కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు.. 20న ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలపై అవగాహన కల్పించనున్నారు. 23న ఉన్నత విద్య, నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వం.. 27న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, సమస్యలను ఎదుర్కోవడం.. 30న ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు తెలియజేస్తారు. జూన్ 3న కౌమార బాలికల నాయకత్వం, సాధికారత, జూన్ 6న శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యత, జూన్ 10న బాల్య వివాహాలతో కలిగే దుష్ప్రభావాలు, నివారణ తరగతులు ఉంటాయన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు

ప్రత్తిపాడు: ఆర్టీఈ చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచితంగా సీట్లు కేటాయిస్తున్నారని ఎంఈవో సీహెచ్.రమాదేవి అన్నారు. ఉచిత ప్రవేశాలకు సంబంధించి మే 2నుంచి ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుందని తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం మండల విద్యా వనరుల కార్యాలయంలో ఆమె సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంఈవో మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 1వ తరగతిలో కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. 1వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 28 నుంచి జరగాల్సిన దరఖాస్తుల స్వీకరణ అనివార్య కారణాల వల్ల శుక్రవారం నుంచి మొదలవుతాయని అన్నారు. అర్హులైన విద్యార్థులు ప్రాథమిక వివరాలతో సిఎస్ఇ.ఎపి.జివోవి.ఇన్ వెబ్ సైట్ లో మాత్రమే అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 8599లో సంప్రదించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పోస్టర్లును ఆవిష్కరిస్తున్న ఎంఈవో రమాదేవి, ఈఆర్పీలు

ప్రత్యేక ప్రార్థనలతో ఆశీర్వాద కూడిక

గుంటూరు రూరల్: దేవుడు ప్రతీ కుటుంబాన్ని ఆశీర్వదిస్తారని కృపా మినిస్ట్రీ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మాథ్యూస్ తెలిపారు. ఏటా మే డే రోజున కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగే కుటుంబ ఆశీర్వాద ప్రత్యేక ప్రార్థనా కూడిక మహాసభను గురువారం నల్లపాడు రోడ్డులోని మెట్టుమల్లారెడ్డి పొలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి, సభను ప్రారంభించారు. కార్యక్రమంలో కృపా మినిస్ట్రీస్ బ్రదర్స్, సిస్టర్స్ క్రీస్తు గీతాలను ఆలపించారు. బ్రదర్ మాథ్యూస్ దేవుడి వాఖ్యాన్ని విశ్వాసులకు అందించారు. క్రీస్తుని నమ్మిన కుటుంబాలను ఆయన ఆశీర్వదిస్తారన్నారు. కార్యక్రమంలో బ్రదర్ హోసన్న, స్థల యజమాని మెట్టు కృష్ణారెడ్డి, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

ఆదర్శ కావ్యం శ్రీరామచరిత మానసం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శ్రీ రామచరిత మానసం గ్రంథంపై ఆధ్యాత్మిక ప్రవచనాన్ని గురువారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్య దర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధ్యాత్మికవేత్త చిమట రాఘవరావు ప్రవచనం చేశారు. ఉత్తర భారతదేశంలో శ్రీరామచరిత మానసానికి ఉన్నంత ప్రాశస్తి, ప్రాచుర్యం మరే ఏ గ్రంథానికీ లేదనడంలో అతిశయోక్తి లేదని తెలిపారు. శ్రీరామచంద్రుని చరిత్ర నిర్మలమైన మానస సరోవరం వంటిదని పేర్కొన్నారు. అపూర్వ భావాన్ని తులసీదాసు ఈ కావ్య నామధేయం ద్వారా లోకానికి వెల్లడించారని చెప్పారు. వివిధ భాషలలో వెలసిన రామాయణ కావ్యాలలో గోస్వామి తులసీదాసు రచించిన శ్రీరామచరిత మానసం కావ్యం ఆదర్శమైనదని పేర్కొన్నారు. జాతిపిత గాంధీ మహాత్ముడు తులసీదాస్ రామాయణాన్ని అన్ని భక్తి సాహిత్యాలలో గొప్ప గ్రంథంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారని రాఘవరావు గుర్తు చేశారు.



మాట్లాడుతున్న రాఘవరావు

వర్చువల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌కు స్పందన

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం నెల్లూరుకు చెందిన డివైన్ హెల్త్‌కేర్, ఒమేగా హెల్త్‌కేర్ సంయుక్తంగా వర్చుచ్యువల్ పద్ధతిలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌కు స్పందన లభించినట్లు ప్రిన్సిపాల్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. వివిధ కళాశాలల నుంచి పాల్గొన్న 67 మంది విద్యార్థులకు డివైన్ హెల్త్‌కేర్ సహ వ్యవస్థాపకుడు విజయన్ శేఖర్ పర్యవేక్షణలో ట్రైనీ మెడికల్ కేడర్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన వారికి 15 రోజుల్లో జాబ్ ఆఫర్ లెటర్లు పంపనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావులు విజయన్ శేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ పి. సీతారామయ్య, ఏ. ప్రత్యూష, ప్లేస్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విజయన్ శేఖర్‌ను సన్మానిస్తున్న జూపూడి రంగరాజు

నాట్య కళను రాబోయే తరాలకు అందించాలి

లక్ష్మీపురం: డిజిటల్ యుగంలో నాట్య కళను సజీవంగా కొనసాగించడానికి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలని కళాకారులు, గాయకులు విజ్ఞప్తి చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా 'నాట్య కళను యువత ప్రోత్సహించాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ నాటక రచయిత, దర్శకుడు కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ నాట్యం విశ్వభాష అని, ప్రపంచ ప్రజలను ఏకం చేయగల శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. సంగీత విద్వాంసులు మల్లేశ్వరరావు, గాయని యార్లగడ్డ లక్ష్మి, నాట్యరంగ ప్రముఖులు శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కావూరి సత్యనారాయణ